క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీలో చేరిక



పాతిన సారంగధరుడిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్

మద్దిపాలెం: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధాంతాలు నచ్చి ఆ పార్టీలో 51వ వార్డుకు చెందిన పాతిన సారంగధరుడు చేరారు. తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు సమక్షంలో మంగళవారం పార్టీలో చేరిన ఆయనకు వైఎస్ జగన్ పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. సారంగధరుడు ఆర్మీలో ఆఫీసర్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు. గతంలో శ్రీకాకుళం జిల్లా కాంగ్రెస్ యూత్ ప్రెసిడెంట్‌గా పనిచేశారు. సోషల్ వర్కర్‌గా ఉంటూ అనేక సేవలందిస్తున్నారు. 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్, 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, మాజీ కార్పొరేషన్ డైరెక్టర్ పైడి శ్రీను ఆయనకు అధినేత సమక్షంలో అభినందనలు తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

మద్దిపాలెం: జోన్–2 ఎస్ఎస్‌టీఎల్ సెక్షన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల నిర్వహణ, మరమ్మతుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బీకే నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు 11 కేవీ తెన్నేటినగర్, సీతన్న గార్డెన్స్ ఫీడర్ల పరిధిలోని కనకదుర్గా ఫంక్షన్ హాల్ జంక్షన్, మాధవధార, గాయత్రి విద్యా మందిర్ రోడ్డు, జనతా గ్యారేజ్ జంక్షన్, గ్యాస్ గొడౌన్ జంక్షన్, తెన్నేటినగర్, ఎంఎస్‌ఆర్ పార్కు రోడ్డు, రాంసాయి ప్లోర్ కూడలి నుంచి వాటర్ ట్యాంక్ వరకు, మాధవధార, ఎస్‌పీడీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

ఘనంగా శ్యామలాంబ తొలేళ్ల సంబరం



విద్యుద్దీపాల అలంకరణలో శ్యామలాంబ ఆలయ ముఖద్వారం

సీతంపేట: అక్కయ్యపాలెం లలితానగర్‌లో కొలువైన శ్యామలాంబ అమ్మవారి పండగ మహోత్సవంలో భాగంగా బుధవారం తొలేళ్ల సంబరం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని పూలమాలలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయ పరిసర రహదారులను విద్యుత్ దీపాల అలంకరణలతో తీర్చిదిద్దారు. భక్తులు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలు సమర్పించారు. ఉదయం అమ్మవారికి జలాభిషేకం జరిపారు. గురువారం ఆలయం వద్ద పరస కార్యక్రమం, 23న అనుపు ఊరేగింపు, 30న మారువారం పండగ, జూన్ 2వ తేదీ మధ్యాహ్నం ఆలయం వద్ద మహా అన్నదాన కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ ప్రతినిధులు తెలిపారు.

గెడ్డ అడుగు భాగం శిథిలం



శంకరమఠం రోడ్డులోని గెడ్డ అడుగు భాగాన శిథిలమైన బేస్‌మెంట్


సీతంపేట: గెడ్డల్లో అడుగు భాగంలోని కాంక్రీట్ ప్లాట్‌ఫారం శిథిలమవడంతో మురుగు నీరు భూమిలో ఇంకి భూగర్భ జలాల కలుషితానికి కారణమవుతున్నాయి. జీవీఎంసీ 26వ వార్డు శంకరమఠం రోడ్డులోని క్రౌన్ బేకరీ ఎదురుగా ఉన్న గెడ్డలో బేస్‌మెంట్ కాంక్రీట్ శిథిలమైంది. మురుగు నీటి ప్రవాహం ధాటికి కోతకు గురై పలు చోట్ల కాంక్రీట్ శ్లాబ్ కొట్టుకుపోయింది. దీంతో గెడ్డలో ప్రవహిస్తున్న మురుగు నీరు భూమిలో ఇంకి, చుట్టుపక్కల భూగర్భ జలాలు కలుషితమయ్యే ప్రమాదముందని నివాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి గెడ్డల్లో అడుగు భాగాన కాంక్రీట్ శ్లాబ్ పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఊరెళ్తే.. జాగ్రత్త!

ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌తో ఇంటికి భద్రత

విలువైన వస్తువులు భద్రపరచుకోండి

కంచరపాలెం క్రైం పోలీసుల అవగాహన



తాళం వేసిన ఇళ్లే దొంగల టార్గెట్



ఐటీఐ కాలేజీలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న క్రైం ఎస్ఐ సూర్యనారాయణ(ఫైల్)

మద్దిపాలెం: ఇటీవల కాలంలో దొంగలు పేట్రేగిపోతున్నారు. ఇల్లు తాళం వేసి ఉంటే చాలు.. దొంగతనాలకు పాల్పడుతున్నారు. కంచరపాలెం ఐదో పట్టణ క్రైం పోలీస్ స్టేషన్ పరిధిలో కొంత క్రైం రేట్ తగ్గుముఖం పట్టినప్పటికీ.. ఇంకా కొన్ని చోట్ల దొంగలు దర్జాగా చోరీలకు పాల్పడుతున్నారు. వేసవి సెలవుల నేపథ్యంలో ఇళ్లకు తాళాలు వేసుకుని సొంతూళ్లు, విహార యాత్రలు, బంధువుల ఇళ్లకు వెళ్లే వారు చాలా మంది ఉంటారు. ఊరెళ్లే ముందు ఇంటి భద్రత కోసం ఒక్కసారి ఆలోచించాలని క్రైం పోలీసులు సూచిస్తున్నారు. ఆ సమయంలో ఇరుగు పొరుగు వారికి ఓ మాట చెప్పి వెళ్లడం వల్ల వారు నిఘా ఉంచుతారని చెబుతున్నప్పటికీ.. హడావుడిగా కొందరు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా ఊళ్లు, బయట ప్రదేశాలకు వెళ్తుంటారని, దీంతో చోరీలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ఇటువంటి సందర్భంలో సమీప పోలీస్ స్టేషన్‌లో ముందుగా సమాచారమివ్వాలని కోరుతున్నారు.

చోరీల నియంత్రణపై ప్రజలకు అవగాహన

ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రాంతాల్లో దొంగతనాల నియంత్రణపై క్రైం పోలీసులు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగతనాలు ఎలా జరుగుతాయి, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు, విద్యార్థులకు వివరించి అవగాహన కల్పిస్తున్నారు. ఊరెళ్లే వారు పోలీసులకు సమాచారమివ్వడం ద్వారా నిఘా ఉంచుతామని చెబుతున్నారు. ప్రతి ఒక్కరూ ప్రత్యేకంగా ఇంటి ఆవరణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తున్నారు. వీటి వల్ల దొంగలను గుర్తించడం తేలికవుతుందన్నారు. నేరాల నియంత్రణకు ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని, సాంకేతికతతో చాలా వరకు చోరీలకు చెక్ పెట్టవచ్చని క్రైం పోలీసులు చెబుతున్నారు.



ఐటీఐ జంక్షన్ సమీపంలో అపార్ట్‌మెంట్ వాసులకు అవగాహన కల్పిస్తున్న క్రైం సీఐ శ్రీనివాసరావు(ఫైల్)

ఇంటికి కాపలా 'ఎల్‌హెచ్‌ఎంఎస్'

లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్(ఎల్‌హెచ్‌ఎంఎస్) యాప్ ద్వారా ఎన్నో ఉపయోగాలున్నాయి. ఎల్‌హెచ్‌ఎంఎస్ వ్యవస్థను నగర పోలీసులు ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు.

LHMS AP Police

- ఈ యాప్‌ను మొబైల్ ఫోన్‌లో గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని రిజిస్టర్ అవ్వాలి. అందులో ఇంటి అడ్రస్, ఫోన్ నంబర్ జత చేయాలి. తర్వాత అందులో ఇచ్చిన ఫోన్ నంబర్‌కు ఓటీపీ, యూజర్ ఐడీ వస్తాయి.
- ఊరెళ్లినప్పుడు ఈ యాప్‌ను తెరిచి యూజర్ ఐడీ ఇచ్చి రిక్వెస్ట్ పోలీస్ వాచ్ ద్వారా సమాచారం అందించాలి.
- ఇంట్లో నుంచి ఎప్పుడు ఏయే తేదీల్లో వెళ్తామో సబ్‌మిట్ ద్వారా వివరాలను సమర్పించాలి.
- యాప్ ద్వారా సమాచారం తెలుసుకుని పోలీసులు మీ ఇళ్ల వద్దకు వచ్చి వైర్‌లెస్ మోషన్ సీసీ కెమెరాలు, మోడెమ్ వంటి పరికరాలు ఏర్పాటు చేసి వెళ్తారు. మరుక్షణం నుంచి ఆ ఇంటిపై పోలీస్ నిఘా ఉంటుంది.
- ఎవరైనా తాళం పగలగొట్టాలని చూస్తే అక్కడున్న కెమెరాలో అలారం మోగుతుంది. వెంటనే పోలీసులకు సమాచారమంది.. వారు అలెర్ట్ అవుతారు.
- తాళం వేసి ఉన్న సమయంలో ఎవరైనా ఇంటికి వస్తే సీసీ కెమెరాల సహాయంతో ఆయా వీడియోలు, ఫొటోలు పోలీస్ కంట్రోల్ రూమ్‌కు చేరుతాయి. ఇవన్నీ ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌తో సాధ్యమని క్రైం పోలీసులు చెబుతున్నారు.

జాగ్రత్తలన్నీ పాటించాలి



వేసవి సెలవుల్లో సొంతూళ్లకు వెళ్లే వారు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. విలువైన వస్తువులను భద్రపరచుకోవాలి. ఇంటికి తాళం వేసి ఊరెళ్లే ముందు సమాచారాన్ని పోలీసులకు అందజేయాలి. ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి. సీసీ కెమెరాలు తప్పక ఏర్పాటు చేసుకోవాలి. దొంగతనాలు అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పోలీసులకు సహకరించాలి. అత్యవసరమైన పరిస్థితి వస్తే డయల్ 100కు లేదా నేరుగా క్రైం ఎస్ఐ 83310 41687 నంబర్‌కు కాల్ చేసి సమాచారమివ్వాలి.

– ఎస్.శ్రీనివాసరావు, క్రైం సీఐ, కంచరపాలెం వెస్ట్ సబ్ డివిజన్

యోగ సిద్ధాంజనేయుడికి కలశాభిషేకం



స్వామికి కలశాభిషేకం చేస్తున్న అర్చకులు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

మురళీనగర్: జాతీయ రహదారి సూర్యానగర్‌లో వెలసిన యోగ సిద్ధాంజనేయ స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు బుధవారం కలశాభిషేకం నిర్వహించారు. పాంచరాత్ర ఆగమ సంప్రదాయంలో ఆలయ అర్చకుడు ఆరవెల్లి శ్రీకాంతాచార్యులు, ఇతర అర్చక బృందం మంగళధ్వని, వేద మంత్రాలతో యోగ సిద్ధాంజనేయ స్వామి ఉత్సవమూర్తికి, సీతారామచంద్ర పట్టాభిషేకమూర్తులకు పంచామృతాభిషేకం చేశారు. వివిధ నదీ జలాలు, సుగంధ ద్రవ్యాలతో కూడిన అష్టోర శతకలశ స్నపనం జరిపారు. అనంతరం భక్తులచే సామూహికంగా సుందరాకాండ పారాయణం, అర్చన, విశేష హోమాలు, తీర్థగోష్ఠి నిర్వహించారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రీరామ నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు పెనుమత్స సుబ్బరాజు, యశోద దంపతులు, వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయ అర్చకుడు జి.శేషాచార్యులు, ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మహిళా వాకర్స్ క్లబ్ వార్షికోత్సవం నేడు

మురళీనగర్: మాధవధార మహిళా వాకర్స్ 19వ వార్షికోత్సవం గురువారం నిర్వహిస్తామని క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కె.మాధవి, పి.కమల ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటలకు ఈస్ట్ పార్కులో జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా క్లబ్ నిర్వహించిన సేవా కార్యక్రమాలపై సమీక్ష చేస్తామన్నారు. ముందుగా బెంగళూరుకు చెందిన రుషి శ్లోక, అన్వితల కూచిపూడి నృత్య ప్రదర్శన, పాశ్చాత్య నృత్యాలు ఉంటాయని చెప్పారు. అనంతరం పదో తరగతిలో ప్రతిభావంతులకు నగదు ప్రోత్సాహకాలు అందిస్తామని, మహిళలు అత్యధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

కుమ్మేసిన వాన



రామాటాకీస్ రోడ్డులో కురుస్తున్న వర్షం



అక్కయ్యపాలెం హైవేపై జోరు వాన

సీతంపేట: మండుతున్న ఎండలతో సతమతమవుతున్న ప్రజలకు చల్లటి వాన ఊరటనిచ్చింది. బుధవారం ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం మూడు పూటలా జోరుగా వర్షం కురిసింది. వారం రోజులుగా భానుడి ప్రభావంతో అల్లాడిపోతున్న జనం చల్లని వాతావరణంలో సేదతీరారు. వేసవి ఉక్కపోత నుంచి ఉపశమనం కలిగిందని, ఎండా కాలం పోయి వర్షా కాలం వచ్చినట్టుందని సంబరపడ్డారు. భారీ వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. సీతంపేట, అక్కయ్యపాలెం, జగన్నాథపురం, శ్రీనివాసనగర్, అబిద్‌నగర్, నరసింహనగర్ ప్రాంతాల్లోని రహదారులపై వర్షపు నీరు ఏరులై ప్రవహించింది. డ్రైయిన్లు, గెడ్డలు పొంగి ప్రవహించాయి. వానలో తడవకుండా ఉండేందుకు పాదచారులు, వాహన చోదకులు పరుగులు తీశారు. ఉద్యోగులు, వ్యాపారులు తమ విధులకు, అత్యవసరంగా బయటకు వచ్చిన వారు గొడుగులు, రెయిన్‌కోట్లు ధరించి పనులు చక్కబెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వ్యాపారాలు సాగక చిరు వ్యాపారులు, తోపుడుబళ్ల వ్యాపారులు ఉసూరుమన్నారు. ముసురుతో బేరాలు లేక రోజు కూలీ కూడా కిట్టలేదని, పైగా తెచ్చిన సరుకు పాడైపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కొనేవారు లేక నరసింహనగర్ రైతుబజార్ వెలవెలబోయింది.

అంతర్జాతీయ వేదికపై సత్తా చాటాలి



జాతీయ జెండా ప్రదర్శిస్తున్న వెటరన్ అథ్లెట్స్, విశాఖ మాస్టర్స్ అథ్లెటిక్ ప్రతినిధులు

మురళీనగర్: అంతర్జాతీయ వెటరన్ క్రీడా పోటీల్లో విశాఖ క్రీడాకారులు సత్తా చాటి భారత కీర్తి పతాకాన్ని ఎగురవేయాలని ఇండియా మాస్టర్స్ అథ్లెటిక్స్ సెక్రటరీ జనరల్ మంగ వరప్రసాద్ ఆకాంక్షించారు. గత ఫిబ్రవరిలో రాజస్థాన్ ఆళ్వార్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ చూపి పతకాలు సాధించిన వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ విశాఖపట్నం(వావ్) క్రీడాకారులు కె.పూర్ణిమ, కె.మత్స్య కొండ, కె.బి.వి.ఎం.కృష్ణప్రసాద్‌లు ఈ నెల 23 నుంచి మలేషియాలో నిర్వహించనున్న అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్–2025కు బుధవారం బయలుదేరారు. ఈ సందర్భంగా మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విశాఖ వెటరన్ అథ్లెటిక్స్ మాట్లాడుతూ 100, 200, 400, 800, 1500 కి.మీ. రన్, 5 కి.మీ. వాక్, లాంగ్ జంప్, హైజంప్, షాట్‌పుట్, డిస్కస్ త్రో, జావిలిన్ త్రో తదితర క్రీడా పోటీల్లో వావ్ అథ్లెట్స్ పోటీ పడతారన్నారు. ఈ సందర్భంగా వీరికి స్పోర్ట్స్ కిట్‌లు అందించారు. కార్యక్రమంలో వరల్డ్ టీచర్ ట్రస్ట్ డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్, వావ్ కో ఆర్డినేటర్ సీహెచ్ శ్రీనివాసరాజు, కార్యదర్శి ఎల్.వి.సుధాకర్, కోశాధికారి ఎం.రామారావు పాల్గొన్నారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం



అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న ఈవో రమాబాయి

సీతంపేట: అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డు దొండపర్తిలో కొలువైన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. పసుపు, కుంకుమ కలిపిన నీటితో భక్తులు తమ స్వహస్తాలతో అభిషేకం జరిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో జి.వి.రమాబాయి పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారికి జలాభిషేకం చేశారు.

రైల్వే హాస్పిటల్‌లో డీఆర్‌ఎం తనిఖీలు



రైల్వే ఆస్పత్రిలో పేషెంట్‌తో మాట్లాడుతున్న డీఆర్‌ఎం లలిత్ బోరా

తాటిచెట్లపాలెం: డివిజనల్ రైల్వే హాస్పిటల్‌లో బుధవారం డీఆర్‌ఎం లలిత్ బోరా చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శరత్‌బాబుతో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రోగులకు అందుతున్న డయాలసిస్ యూనిట్, ఓపీ డిపార్ట్‌మెంట్, ఆపరేషన్ థియేటర్స్, మెడికల్, సర్జికల్ స్టోర్స్, రోగుల వార్డులును పరిశీలించారు. రోగులతో, వైద్య, సహాయక సిబ్బందితో డీఆర్‌ఎం స్వయంగా మాట్లాడారు. అందుబాటులో ఉన్న సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి నిర్వహణపై డీఆర్‌ఎం సంతృప్తి వ్యక్తం చేశారు. విధుల్లో సిబ్బంది అంకితభావాన్ని ప్రశంసించారు. పేషెంట్లకు మరింత మెరుగైన సేవలందిస్తూ, స్నేహపూర్వక వాతావరణం కలిగి ఉండాలని సూచించారు. తనిఖీల్లో ఏసీఎంలు డాక్టర్ చారుమతి, డాక్టర్ లక్ష్మణరావు, సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ యూసుఫ్ కబీర్ అన్సారి, సీనియర్ డివిజనల్ ఇంజినీర్(హెడ్ క్వార్టర్స్) జగదీష్, ఇతర ఉన్నతాధికారులు, హస్పిటల్ సిబ్బంది, ప్రతినిధులు పాల్గొన్నారు.

బౌద్ధ దార్శనికుడు అశ్వఘోషుడు



ప్రసంగిస్తున్న పిళ్లా రమణమూర్తి

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజం కళాశాలలో 'అశ్వఘోషుడు, బుద్ధ చరితం' అనే అంశంపై విశ్రాంత తెలుగు అధ్యాపకుడు పిళ్లా రమణమూర్తి ప్రసంగించారు. క్రీ.శ.80–150 మధ్య కాలానికి చెందిన అశ్వఘోషుడు బౌద్ధ దార్శనికుడు, మహా కవి, నాటక కర్తని తెలిపారు. బౌద్ధ ధర్మాన్ని ప్రజలకు ప్రచారం చేయడానికి అశ్వఘోషుడు తన కవిత్వాన్ని సాధనంగా చేసుకున్నాడని పేర్కొన్నారు. అతను రచించిన గ్రంథాల్లో బుద్ధ చరిత, సౌందరనందం అనే రెండు మహా కావ్యాలు, సారిపుత్ర ప్రకరణం అనే నాటకం, వజ్రసూచి అనే బౌద్ధ ధర్మ గ్రంథం ముఖ్యమైనవన్నారు. డాక్టర్ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ సంస్కృతంలో గౌతమ బుద్ధుడి జీవిత చరిత్రను సమగ్ర సుందరంగా రచించిన వ్యక్తి అశ్వఘోషుడని కొనియాడారు. కార్యక్రమంలో శేఖరమంత్రి ప్రభాకర్, కేవీఎస్ మూర్తి, సిహెచ్.చిన సూర్యారాయణ, చల్లా రాంబాబు, కొత్తూరు రమణ, సోమంచి వినయ భూషణరావు, బి.రాధారాణి పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరానికి స్పందన



కంటి వైద్య పరీక్షలు చేస్తున్న శంకర్ ఫౌండేషన్ వైద్యులు

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డు కప్పరాడ, రాంజీ ఎస్టేట్, పెదకొత్తూరు ప్రాంతాల్లో దక్షిణాసియా ఎల్‌పీజీ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ నేతృత్వంలో శంకర్ ఫౌండేషన్ సహకారంతో బుధవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. దీనిని సీనియర్ మేనేజర్ జి.సుబ్బారాయుడు, జనరల్ మేనేజర్ కె.రాధాకృష్ణన్, డిప్యూటీ జనరల్ మేనేజర్ వి.రమేష్‌కుమార్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.బంగార్రాజు మాట్లాడుతూ ఈ స్క్రీనింగ్ చొరవతో నెల రోజుల పాటు డోర్ టూ డోర్ 'ఐ' క్యాంప్ కొనసాగుతోందని తెలిపారు. సుమారు 170 మంది రోగులకు కంటి వైద్య పరీక్షలు చేసి, మందులు, కళ్ల జోళ్లు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో సీఎస్‌ఆర్ అధిపతి పి.సి.రామ్‌నాథ్, కంపెనీ కార్యదర్శి రాకేష్, బంగారరావు, వైద్య సిబ్బంది, ఆయా గ్రామాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



వంశీనగర్‌లో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్ పీలా, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

మద్దిపాలెం: జీవీఎంసీ 50, 51 వార్డుల్లో పలు అభివృద్ధి పనులకు సంబంధించి రూ.1.15 కోట్లతో శ్రీకారం చుట్టారు. మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, కార్పొరేటర్లు వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణతో కలిసి బుధవారం ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రజల కోసం నిర్మిస్తున్న సామాజిక భవనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక సమస్యలపై దృష్టి సారిస్తామని తెలిపారు. 50వ వార్డు వంశీనగర్‌లో రూ.40.90 లక్షలతో నిర్మించిన సామాజిక భవనాన్ని వారు ప్రారంభించారు. రూ.19.95 లక్షలతో మురళీనగర్ వాకర్స్ క్లబ్‌లో వాకింగ్ ట్రాక్ సైడ్ వాల్స్, మాధవధారలో కల్వర్టులు, సీసీ రోడ్లకు రూ.19.40 లక్షలు, సాయిరాం నగర్ కొండవాలు ప్రాంతంలో రూ.19.45 లక్షలతో కల్వర్టులు, సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టామని, 51వ వార్డులో రూ.16.20 లక్షలతో గ్రంథాలయం పునర్నిర్మించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం స్థానికులు పలు సమస్యలను ఆయనకు చెప్పడంతో త్వరలోనే పరిష్కరిస్తామని ఎమ్మెల్యే అన్నారు. నాయకులు పాల్గొన్నారు.

కూటమిలో సమన్వయ లోపం..

50వ వార్డుకు సంబంధించి అన్ని ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు వంశీనగర్‌లో ఒకే చోట చేయడంపై పలువురు కూటమి నాయకులు మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఏం చేస్తుందో ప్రజలకు తెలియాలంటే ఆయా ప్రాంతాల్లోనే శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయాలంటున్నారు. వారిలో వారికే పడకపోతే పాలన ఎలా సాగిస్తారని ప్రజలు గుసగుసలాడుతున్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



సినీ గీతాలు ఆలపిస్తున్న గాయనీ గాయకులు

సీతంపేట: అలనాటి మేటి నటులు చంద్రమోహన్, రంగనాథ్ నటించిన చిత్రాల్లోని పాటలను నగరానికి చెందిన గాయనీ గాయకులు మృధు మధురంగా ఆలపించి అలరించారు. సత్య సుమధుర స్వరాలు సంస్థ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో బుధవారం నిర్వహించిన సంగీత విభావరి ప్రేక్షకులను ఉర్రూత లూగించింది. గాయనీ గాయకులు పి.బి.ఖాన్, లక్ష్మీస్వరూప, మాధురి, గంటి ఉష, శోభారాణి, రంజిత, పెమ్మరాజు రామ్, కె.ఎల్.రావు, శంకర్, నాయుడు పలు సినీ గీతాలు పాడి ఆకట్టుకున్నారు. రా దిగి రా.. భువికి దిగిరా శీర్షికన నిర్వహించిన సినీ సంగీత విభావరిలో అలనాటి మేటి తెలుగు, హిందీ గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో సంస్థ గౌరవాధ్యక్షుడు కట్టా మల్లేశ్వరరావు, సన్‌మూర్తి, సత్యవతి ఖాన్, రాజేశ్వరి పాల్గొన్నారు.

జిల్లా ప్రజా రవాణాధికారికి ప్రశంసాపత్రం



ప్రశంసాపత్రం అందుకుంటున్న జిల్లా ప్రజా రవాణాధికారి అప్పలనాయుడు

డాబాగార్డెన్స్: అధిక ఇంధన పొదుపు చేయడం, అత్యుత్తమంగా బస్సులు నడపడంలో జిల్లా ప్రజా రవాణాధికారి బి.అప్పలనాయుడుకు ప్రశంసలు అందుకున్నారు. ఏపీఎస్‌ఆర్టీసీ ప్రధాన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు నుంచి ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఎగ్జిక్యూటివ్ డైరక్టర్స్(ఇంజినీరింగ్, పరిపాలన విభాగాలు), ప్రాంతీయ మేనేజర్లు పాల్గొన్నారు.

కొండలను ముద్దాడిన మబ్బులు



రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాతావరణం కాస్త చల్లబడింది. ఆరిలోవ ప్రాంతం చుట్టూ కొండలు ఉండటంతో బుధవారం వాతావరణం ఆహ్లాదకరంగా మారింది. ఉదయం, సాయంత్రం వర్షం జల్లులు కురిసిన సమయంలో నల్లని మేఘాలు కమ్మేశాయి. చుట్టూ కొండలను తాకుతున్నట్టున్న మేఘాలు చూపరులకు ఆనందాన్ని పంచాయి.

– ఆరిలోవ